# మన చౌరాస్తా

సంచిక : 134 | శుక్రవారం, 19 సెప్టెంబర్ 2025 | పేజీలు : 4





# ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలి

- జనగామ ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్
- బచ్చన్నపేట స్వచ్ఛతా హీ కార్యక్రమం
- రంగోళి, చిత్రలేఖనంతో ఆకట్టుకున్న విద్యార్థులు

**బచ్చనపేట, మన చౌరాస్తా :** ప్రతి ఒక్కరు స్వచ్ఛత పాటించాలని, అప్పుడు మెరుగైన సమాజానికి బాటలు పడతాయని జనగామ ఇన్‌చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2వ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ 2025 పక్షోత్సవాలలో భాగంగా బచ్చన్నపేట మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బచ్చన్నపేట ప్రధాన కూడలిలో విద్యార్థులు, మహిళా సంఘ సభ్యుల, గ్రామ ప్రజలచేత మానవహారం, ర్యాలీ, స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో సుమారు 600 మందితో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతయే మన నినాదం ఆరోగ్యమే అన్నింటికన్నా ప్రధానం అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాలలో స్వచ్ఛతపై నిర్వహించిన రంగోళి, చిత్రలేఖనం పోటీలను తిలకించి విజేతలకి బహుమతులని ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీపీవో స్వరూప, డీసీ ఎస్‌బీఎం కర్ణాకర్, ఎంపీడీఓ, ఎంపీవో మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.




3 లో

# కొనుగోళ్లకు రెడీ కావాలి

- వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద

# రైతులకు ఇబ్బంది పెట్టొద్దు..

**బచ్చనపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండలం కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని ఇంచార్జ్ కలెక్టర్ పింకేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. భౌతిక నిల్వలతో పాటు స్టాక్ రిజిస్టర్, రైతు వారి సేల్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా యూరియా పంపిణీ చేయాలన్నారు. ఇప్పటివరకు బచ్చన్నపేట మండలంలోని తొమ్మిది కేంద్రాల ద్వారా, సబ్ సెంటర్ల ద్వారా రైతులందరికీ యూరియా సరఫరా చేస్తున్నామని, వివిధ డీలర్ల ద్వారా 848 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేసినట్టు చెప్పారు. సెప్టెంబర్ మాసానికి గాను మండలానికి 200 మెట్రిక్ టన్నుల యూరియా అవసరానికి గాను ఇప్పటివరకు 198 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయ్యిందని తెలపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీన్, ఇందిరమ్మ ఇళ్ల గురించి సంబంధిత అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో డీపీవో స్వరూప, మండల వ్యవసాయ అధికారి, ఏఈఓలు పాల్గొన్నారు.










# బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛతే.. సేవలు



# విద్యార్థులు పట్టుదలతో చదవాలి

▪ **హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్**



హనుమకొండ, మన చౌరాస్తా : ప్రతి విద్యార్థి తాము ఎంచుకున్న లక్ష్యం కోసం పట్టుదలతో చదివి సాధించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా పరకాల లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ లో తరగతి గదులు, కిచెన్, డార్మెట్రి, పరిసరాల ను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. కలెక్టర్ విద్యార్థినులను పాఠ్యాంశాలకు సంబంధించి తరగతి గదిలోని బోర్డు పై రాయించారు. విద్యార్థినులకు వండిన భోజన పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థినులచేత పాఠ్యాంశాలను చదివించారు. ఎంచుకున్న లక్ష్యసాధనకు మరింత కష్టపడాలని కలెక్టర్ సూచించారు. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తామన్నారు. అదేవిధంగా పరకాలలో ఉన్న గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న వసతులు, విద్యార్థుల సంఖ్య ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ నారాయణ, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో ఆంజనేయులు, ప్రిన్సిపల్, ఉపాధ్యాయినులు, తదితరులు పాల్గొన్నారు.

## భూములు పంచిన ఘనత కమ్యూనిస్టులదే

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** భూమి, భుక్తి, విముక్తి కోసం దున్నేవానికి భూమి కావాలని, వెట్టి చాకిరిని మట్టు పెట్టాలని సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం కుల, మతాలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా సాగించిన పోరాటమని ఈ పోరాటాన్ని మతోన్మాద శక్తులు కుల మతాల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించి చరిత్రను వక్రీకరిస్తున్నారని ఇలాంటి మతోన్మాద శక్తులకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవలో భాగంగా గురువారం రోజున హుస్నాబాద్ పట్టణంలో తెలంగాణ రైతంగా సాయుధ పోరాట యోధుడు అనబేరి ప్రభాకర్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి రాళ్ల బండి శశిధర్ మాట్లాడుతూ ఆనాడు నైజాం రజాకార్లు భూస్వాములు దొరలు జాగిర్దారులు దేశ్ముఖ్ లకు వ్యతిరేకంగా పీడనకు దోపిడీకి గురవుతున్న ప్రజలందరినీ ఐక్యం చేసి పది లక్షల ఎకరాల భూములు పంచిన,4000 మంది ప్రాణాలర్పించి ప్రజలను రక్షించిన చరిత్ర కమ్యూనిస్టులదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రజలకు అనేక హక్కులు కల్పించిందని ప్రజలు ఆత్మగౌరవంతో తలెత్తుకొనే విధంగా అయ్యా బాంచన్ అనే బక్కోడిని నిటారుగా నిలబెట్టిన పోరాటం అన్నారు.నాటి అమరవీరుల స్ఫూర్తితో బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి,జిల్లా కమిటీ సభ్యులు వెంకట మావో, రవికుమార్, తిప్పారపు శ్రీనివాస్, నాయకులు గూగులోతు శివరాజ్, నాగరాజు, కల్లుగీత సంఘం జిల్లా అధ్యక్షుడు కొయ్యడ కొమురయ్య, బానోతు రాజు నాయక్, సాయి, చరణ్, గిరిధర్ రావు, బాబీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## 20 నుంచి బాలల సంరక్షణ కేంద్రాల తనిఖీ

▪ **అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి**



**హనుమకొండ, మన చౌరాస్తా :** జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాలు కనీస ప్రమాణాలు పాటించాలని హన్మకొండ జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఏ వెంకట రెడ్డి అన్నారు. గురువారం కలెక్టరెట్ మినీకాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులతో సమన్వయ, సమీక్షా సమావేశం జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు ఆశ్రయం పొందుచున్న బాల బాలికలకు వసతి, భోజనం, విద్యా, వైద్యంతో పాటు సరైన వసతులు కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోబోయే చర్యల గురించి వివిధ శాఖల టోల్ ఫ్రీ నంబర్లను డిస్ప్లే చేయాలని సూచించారు. సెప్టెంబర్ 20 నుండి 26 వరకు వరకు జిల్లాలోని ప్రభుత్వ మరియు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలను అదనపు కలెక్టర్ తో పాటు మరో ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఆధ్వర్యంలో తనిఖీ చేయనున్నట్లు తెలియచేసారు. జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి మాట్లాడుతూ సీజన్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు మాట్లాడుతూ స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల అధికారులకు సమాచారం అందించి బాలల సంరక్షణ కేంద్రాల బాల బాలికలకు హెల్త్ ప్రొఫైల్ నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ సీహెచ్ అవంతి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, డాక్టర్ పరికి సుధాకర్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, బాల సదనం సూపరింటెండెంట్ కళ్యాణి, శిశు గృహ ఇన్చార్జి మేనేజర్ ఏ మాధవి, జిల్లా ఇన్స్పెక్షన్ కమిటీ సభ్యులు ఎర్ర శ్రీకాంత్, సంగి చైతన్య విజయ్ కుమార్, సుజాత, బాలల సంరక్షణ కేంద్రాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పరిస్థితులపై సమగ్ర అవగాహన

▪ **విద్యార్థుల వినూత్న ప్రదర్శన**



**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలోని గట్లనర్సింగాపూర్ గ్రామంలో ఎస్.ఆర్. యూనివర్శిటీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పార్టిసిపేటరీ రూరల్ అప్రైజల్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. గత మూడు నెలలుగా రావెపప్ ప్రోగ్రామ్లో భాగంగా గ్రామంలోనే నివసిస్తూ రైతులతో అనుసంధానమై పనిచేస్తున్న విద్యార్థులు, ఈ సందర్భంగా గ్రామ వనరులు, భౌగోళిక పరిస్థితులు, పంటల శాతం, పశుసంవర్ధక స్థితి, గ్రామ సమస్యలు వంటి అంశాలను సమగ్రంగా సేకరించి వనరుల పటం, గ్రామ సమస్యల చెట్టు, మట్టి నిర్మాణాల పై చార్ట్, గ్రామ పంటల శాతం గ్రాఫ్, రైతుల భూస్వామ్య పరిమాణం పిరమిడ్ తదితర చిత్రపటాలను తయారు చేసి ప్రదర్శించారు.ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల డీన్ డా. జి. భూపాల్ రాజ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామ సమస్యలు, వనరులు, పశుసంవర్ధక పరిస్థితులు, జనాభా గణాంకాలు స్పష్టంగా బయటపడ్డాయి. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఇవి కీలకంగా ఉపయోగపడతాయి అన్నారు. రావెప్ ఇంచార్జి డా. జి. శ్రీకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గ్రామంలో నివసిస్తూ రైతులతో నేర్చుకుంటూ, నేర్పిస్తూ తయారు చేసిన మాప్స్, చార్ట్స్ గ్రామస్తులకు అవగాహన కల్పించి, భవిష్యత్తులో మార్పులను అవలంబించేందుకు దోహదపడతాయి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆగ్రోనమీ ప్రొఫెసర్ శ్రవ్య, గ్రామ సమన్వయకర్త కార్తీక్ హెచ్పి పాల్గొన్నారు. విద్యార్థుల బృందంలో బి. శివాని, చి. నవ్య చైతన్య, డి. సౌజన్య, ఐ. నందిని, కె. సుజంజలి, ఎస్. సంజనా, పూజ ఉన్నారు.



## రఘునాథపల్లిలో గంజాయి పట్టివేత

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** ఎండు గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని రఘునాథపల్లి పోలీసులు అరెస్టు చేశారు. జనగామ రూరల్ సీఐ ఏ.శ్రీనివాసరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం రాయగడ జిల్లాకు కుసుంగుడి చెందిన కణ్హాయి కుసులియా హైదరాబాద్లోని గచ్చిబౌలిలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్లో చెఫ్గా పనిచేస్తున్నాడు. ఆంజానగర్లో నివాసం ఉంటున్నాడు. కుసులియా ఎండు గంజాయిని తరలిస్తుండగా రఘునాథపల్లిలోని గవర్నమెంట్ స్కూల్ వద్ద పోలీసులు పట్టుకొని పంచనామా చేశారు. అతని వద్దనున్న రెండు ప్యాకెట్లలో గంజాయిని సుమారు రూ.2,07,500 విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని రఘునాథపల్లి ఎస్సై డి.నరేష్ ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు తెలిపారు. నిందితుని రిమాండ్ తరలించినట్టు సీఐ పేర్కొన్నారు.




## క్రిస్టియన్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

▪ **క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్**

**జనగామ, మన చౌరాస్తా :** క్రిస్టియన్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో క్రిస్టియన్ ప్రజల సమస్యలపై జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ పింకేష్ కుమార్, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్తో కలిసి పోస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ దీపక్ జాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నిరుపేద క్రిస్టియన్లకు అందే విధంగా చూడాలని సూచించారు. జిల్లా ఇంచార్జి కలెక్టర్ పింకేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో జనాభా లెక్కల ప్రకారం 6 వేలు క్రిస్టియన్స్ ఉన్నరన్నారు. జనగామ,స్టేషన్ ఘన్పూర్, పాలకుర్తి నియోజక వర్గాలలో బరియల్ గ్రౌండ్ కు చర్యలు తీసుకుంటామని, మున్సిపాలిటీలలో కమ్యూనిటీ హాల్స్ కేటాయించామని వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ బి.విక్రమ్ కుమార్, జిల్లాలోని చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోళ్లకు రెడీ కావాలి

## ▪ వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్, మన చౌరాస్తా :** వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోలు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై వ్యవసాయ, పౌర సరఫరాలు, సహకార, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ, తూనికలు, కొలతల శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025-26 వానాకాలం ధాన్యం కొనుగోలుకు సన్నదం కావాలని అన్నారు. జిల్లావ్యాప్తంగా ఈ సంవత్సరంలో 2 లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని, సుమారు 260 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడి క్లినర్లు, డ్రైయ్యర్ లు, త్రాగునీరు , టార్పాలిన్స్, గన్ని బ్యాగులు, తేమ సాంద్రత కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సంవత్సరం వ్యవసాయ శాఖ అధికారులు ఆయా మండలాల వారీగా ధాన్యం పండించిన రైతులు వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు. ఈ సీజన్లో ఏ గ్రేడ్ రకం క్వింటాలు ధాన్యానికి రూ.2389, కామన్ రకానికి రూ.2369 ప్రభుత్వం ధర నిర్ణయించిందని సన్నరకం ధాన్యానికి ప్రోత్సాహకం ఇస్తున్నందున అన్ని కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యం గుర్తింపు కోసం గ్రెయిన్ కాలిఫర్స్(డయల్ మైక్రోమీటర్) అందుబాటులో ఉంచాలన్నారు. సన్న, దొడ్డు రకాల ధాన్యం గుర్తింపులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, జిల్లా పౌరసరఫరాల అధికారి కిష్టయ్య, డిఎం సురేఖ, డిఆర్డీఓ రామిరెడ్డి, డిసిఓ నీరజ, డీఏఓ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

### మోడల్ హౌస్‌ను పూర్తి చేయాలి

**వరంగల్, మన చౌరాస్తా :** ఇందిరమ్మ మోడల్ హౌస్ ను నిబంధనల మేరకు నాణ్యతతో త్వరితంగా పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మోడల్ హౌస్ ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు, సెట్ బ్యాక్ ఎంత పెట్టారు, ఉపయోగించే మెటీరియల్, క్యూరింగ్ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే నిధులతో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు ఏ విధంగా ఉంటుందో మోడల్ హౌస్ ఉండేలా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని ఎనిమిది మండల కేంద్రాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ మాడల్ హౌస్ పురోగ దశలో ఉన్నాయని, వాటిని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ దుగ్గొండి మండలంలోని తహసీల్దాల్, ఎంపీడీవో కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లో సిబ్బంది హాజరు, ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. ఉద్యోగుల హాజరు బయోమెట్రిక్ ప్రకారం తప్పకుండా జరగాలన్నారు. బయోమెట్రిక్ హాజరు ప్రకారం విధులకు ఆలస్యంగా హాజరైన డిప్యూటీ తహసీల్దార్, ఆపరేటర్లకు షో కాజ్ నోటీసులు



జారీ చేయాలని తహసిల్దారును ఆదేశించారు. కార్యక్రమాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ అధికారి గణపతి, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో అరుంధతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ క్యాంపులు నిర్వహించాలని వినతి

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** మండలంలోని 11 గ్రామాలలో సీజనల్ వ్యాధుల బారిన పడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం పార్టీ కొమరవెల్లి మండల కార్యదర్శి తాడూరి రవీందర్ అన్నారు. సిపిఎం పార్టీ కొమరవెల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ కి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి జబ్బులు ఉన్నవారికి సరైన మెడిసిన్ ఇవ్వాలని ఆయన అన్నారు. గ్రామాలలో నీ అన్ని వీధులలో దోమల నివారణ మందులు పిచికారి చేయాలని, వీధులలో ఉన్న గడ్డికి గడ్డి మందు స్ప్రే చేయించాలని బురద ఉన్న ప్రదేశంలో బ్లీచింగ్ పౌడర్ చల్లి కీటకాలను నివారించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడిగ కృష్ణారెడ్డి మండల కమిటీ సభ్యుడు తాడూరి మల్లేశం, మండల నాయకులు సార్ల యాదయ్య, తాడూరి నరేష్, ఆరుట్ల రవీందర్,కనుగుల రాజు, తాడూరి భరత్ కుమార్, కర్రోల రాకేష్, చింతల ఇంద్రుడు, శ్రావణ చారి, ఎల్లయ్య పాల్గొన్నారు.





## టీఎస్ ఏవైఎస్ కరపత్రం ఆవిష్కరణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం 49వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ముల్కనూర్ అంబేద్కర్ కూడలిలో కరపత్ర ఆవిష్కరించి మాట్లాడారు. 'డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఆలోచన విధానం కేవలం భారతదేశానికే కాక ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకం. దళిత రత్న బొమ్మల కట్టయ్య ఆధ్వర్యంలో 1977లో ఏర్పాటైన ఈ సంఘం, అప్పటి నుంచి సామాజిక న్యాయం కోసం పోరాడుతోంది. భవిష్యత్ తరాలకు అంబేద్కర్ భావజాలం ఆదర్శంగా నిలిచేలా సంఘ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి' అని అన్నారు. ఈ నెల 21న హనుమకొండ అంబేద్కర్ భవన్‌లో జరగబోయే సభ, ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ముల్కనూర్ మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, సమ్మక్క సారలమ్మ మాజీ చైర్మన్ మాడుగుల అశోక్, మండల కన్వీనర్ ఎల్తూరి ప్రేమ్ రాజ్, కామెర లక్ష్మణ్ (బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా), సాతూరి చంద్ర మౌళి, అంబాల చక్రపాణి (టీఎంఆర్‌పీఎస్), కొమ్ముల రవి, మ్యాక స్వామి, వేముల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



## 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** శ్రీహనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబర్ 4 వరకు పద్మాక్షి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆలయ వేదపండితులు నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపినారు. ఈ పత్రికా విలేకరుల సమావేశంలో బ్రోచర్ ఆవిష్కరించారు. గుట్టపైకి కూడా రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. భక్తుల సౌకర్యార్థం మంచినీటి వసతి పార్కింగ్ ఏర్పాట్లు విద్యుత్తు దీపాలంకరణ సాంస్కృతిక కార్యక్రమాలు బతుకమ్మ నిమజ్జనోత్సవం, తిప్పోత్సవం కార్యక్రమాలను నిర్వహించబడుతున్నవి ప్రతిరోజు అమ్మవారిని అభిషేకముప్రత్యేక అలంకరణ పూజలు చండీ హవనము ప్రతిరోజు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో తరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు షణ్ముఖ పద్మనాభ అవధాని, కనుకుంట్ల రవికుమార్ నీలారపు రాజకుమార్, పోలు లక్ష్మణ్, సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




## అంబులెన్స్ సిబ్బందికి అభినందనలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** ముల్కనూరు మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 108, 102 అంబులెన్స్ సేవలను హన్మకొండ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. బులెన్స్ లోని అత్యవసర వైద్య పరికరాలు, ఔషధాలు, రికార్డులను పరిశీలించారు. జనవరి నుంచి ఆగస్టు వరకు 108 అంబులెన్స్ సిబ్బంది 960 ప్రాణాలను రక్షించారని వెల్లడించారు. ఈ సందర్భంగా 10 మంది సిబ్బందిని అభినందించారు. వర్షాకాలంలో వ్యాధులు విస్తరిస్తున్నందున ప్రజలు ఆపత్కాలంలో 108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఫోన్ వచ్చిన 30 సెకండ్లలోనే అంబులెన్స్ బయలుదేరి మెరుగైన వైద్య సేవలు అందించాలంటూ సూచనలు ఇచ్చారు. గర్భిణులు స్త్రీలకు ప్రత్యేకంగా 102 సర్వీస్ సదుపాయాన్ని వివరించారు. గర్భధారణ నుంచి డెలివరీ వరకు ప్రతి నెలా హాస్పిటల్ చెకప్ కోసం ఇంటి దగ్గర నుంచి హాస్పిటల్‌కి, హాస్పిటల్ నుంచి ఇంటికి ఉచితంగా రవాణా సౌకర్యం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఈఎంటి మేకల రవి, పైలట్ కృష్ణంరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ వలయాలు ఏర్పాటు చేయండి

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ మండలం పందిల్ల బ్రిడ్జి వద్ద జరుగుతున్న జాతీయ రహదారి పనుల్లో నిర్లక్ష్యంగా బ్రిడ్జ్ కింద ఎత్తుగా మట్టి పోసి రహదారిపై ఇరువైపులా రక్షణ వలయాలు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో అటువైపుగా వెళ్తున్న వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల రాత్రి వేళ గమనించక మట్టిలో కుంగి ఓ లారీ బోల్తా పడింది. అనంతరం ఒక కారు కూడా అదుపుతప్పి బోల్తా పడింది. తరచూ ప్రమాదాలు జరుగుతున్న కాంట్రాక్టర్ మాత్రం రక్షణ వలయాన్ని ఏర్పాటు చేయడం లేదు. ఇప్పటికైనా పనులను వేగవంతంగా పూర్తి చేసి బ్రిడ్జ్ చుట్టూ రక్షణ వలయాలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.




# క్రీడలు సాధారణం.. ప్రతిభ అసాధారణం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడలకు ముఖ్య అతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు, రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజం.. క్రీడలు శారీరకంగా, మానసికంగా దోహదం చేస్తాయి. ఆటలో మాత్రమే కాకుండా జీవితంలో కూడా సత్తా చాటాలి అని క్రీడాకారులను ప్రోత్సహించారు. అలాగే మండల స్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొనబోతున్న సందర్భంగా వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సునీత, ముల్కనూర్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం.రాజు, భీమదేవరపల్లి ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ ప్రదీప్ కుమార్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల శ్రీకాంత్, వివిధ గ్రామాల పీడీలు, పీఈటీలు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు.



# 21న టీఎస్ ఏవైఎస్ ఆవిర్భావ సభ



**జనగామ, మన చౌరాస్తా :** హనుమకొండలో ఈ నెల 21న నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం (టీఎస్ ఏవైఎస్) 49వ ఆవిర్భావ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మదుపాక ఎల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం జనగామ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నారపు శివశంకర్ ఆధ్వర్యంలో టీఎస్ ఏవైఎస్ 49వ ఆవిర్భావ దినోత్సవ సభ ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ 1977 సెప్టెంబర్ 21న ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ యువజన సంఘం (రిజిస్ట్రేషన్ నంబర్ 1033/77) ఆవిర్భవించిందని తెలిపారు. భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచన విధానంపై అనేక అవగాహన సదస్సులు నిర్వహించి కార్యకర్తలను చైతన్య పర్చినట్లు పేర్కొన్నారు. పదిరి కుప్పం, చుండూరు, కారంచేడు, వేంపల్లిలో చోటు చేసుకున్న కుల దురహంకార దాడులు, మహిళలపై జరిగిన అత్యాచారాల వంటి సంఘటనలపై అంబేద్కర్ యువజన సంఘం విస్తృతమైన పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతోపాటు అగ్రవర్ణాలలోని అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం అంబేద్కర్ యువజన సంఘం పనిచేస్తుందని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంబేద్కరీయులు అధిక సంఖ్యలో హాజరై ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు రవి, సుద్దాల కుమారస్వామి, ఎండబట్ల భాస్కర్, సాంబరాజు యాదగిరి, రాగల్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# లంబాడీల ఆత్మగౌరవ సభ విజయవంతం చేయాలని పిలుపు

**హుస్నాబాద్, మన చౌరాస్తా :** హుస్నాబాద్ బంజారా భవన్‌లో జరిగిన సమావేశంలో గిరిజన నాయకులు శుక్రవారం హైదరాబాద్ ఇందిరా పార్క్‌లో జరగనున్న లంబాడీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుండి 500 మందికి పైగా గిరిజనులు ప్రత్యేక వాహనాల్లో సభకు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. గిరిజనుల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మాలోతు బీలు నాయక్, భూక్య శ్రీనివాస్ నాయక్, గుగులోతు రాజు నాయక్, భూక్య లక్ష్మణ్ నాయక్, కనుక నాయక్, గుగులోతు తిరుపతి నాయక్, భూక్య రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పురుషోత్తంరెడ్డి ఘన నివాళి

**హైదరాబాద్, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తం కుమార్ రెడ్డి తండ్రి దివంగత నలమాదా పురుషోత్తం రెడ్డి ప్రథమ వర్ధంతి గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి పాల్గొని పురుషోత్తం రెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ పురుషోత్తం రెడ్డి ప్రజాసేవలో చూపిన నిబద్ధత, కష్టనష్టాలను లెక్క చేయని త్యాగస్వభావం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం అని అన్నారు. ఆయన ఆశయాలను సాకారం చేయడం ద్వారా సమాజానికి నిజమైన గౌరవం చెల్లించినట్లవుతుందని పేర్కొన్నారు.





# బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్

**జనగామ, మన చౌరాస్తా :** బీజేపీ ఆధ్వర్యంలో జనగామ పట్టణ కేంద్రంలో ఏరియా హాస్పిటల్ లో స్వచ్ఛభారత్ నిర్వహించారు. కార్యక్రమం బొమ్మకంటి అనిల్ గౌడ్, పట్టణ అధ్యక్షులు ఆధ్వర్యంలో చేపట్టారు . ఈ కార్యక్రమానికి పెద్దలు బిజెపి జిల్లా రథసారథి సౌడ రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ భారత ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం పురస్కరించుకొని పక్షం రోజుల పాటు జరిగే సేవా కార్యక్రమంలో భాగంగా జనగామ పట్టణ కేంద్రంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శివరాజ్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భాగాల నవీన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దేవరాయ ఎల్లయ్య, నాయకుల పవన్ శర్మ, జిల్లా కార్యదర్శి రవి రాజా, చంద్రయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి జగదీష్, హరీష్, రమేష్, రాజు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో...

ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు నుండి గాంధీ పుట్టిన రోజు వరకు భాజపా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సేవా పక్షంలో భాగంగా పాలకుర్తి భాజపా మండల శాఖ ఆధ్వర్యంలో పాటిమీద ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణం లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కార్యదర్శి దుంపల సంపత్, మండల అధ్యక్షులు మారం రవికుమార్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు వేల్పుల దేవరాజు, పెనుగొండ సోమేశ్వర్, పట్టణ అధ్యక్షుడు పబ్బా సంతోష్, మచ్చ సునీల్, తండ వినయ్, శ్రీనివాస్, కుమార స్వామి తదితరుల పాల్గొన్నారు.

## వరంగల్‌లో...

ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ' సేవా పక్షం' కార్యక్రమాలలో భాగంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గురువారం వరంగల్ జిల్లా 35వ డివిజన్ పరిధిలో శివనగర్ మండల ప్రధాన కార్యదర్శి వైట్ల గణేష్ ఆధ్వర్యంలో పుప్పాలగుట్ట ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలలో స్వచ్ఛతే సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని బీజేపీ నాయకులతో కలిసి ఆయన చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో సేవా పక్షం జిల్లా కన్వీనర్ కనుకుంట్ల రంజిత్ కుమార్, కో కన్వీనర్లు కర్నే రవీందర్, జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు కందిమల్ల మహేష్, మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సేవా పక్షం మండల కన్వీనర్ సాగరిక, బండి సుజాత, జిల్లా నాయకులు సిద్ధం నరేష్, అంకాల జనార్ధన్, బిజెపి నాయకులు సుర శ్రీనివాస్, పిట్టల వెంకన్న పాల్గొన్నారు.